# గలగలా గోదారి

-భైరవయ్య

"అమ్మా చూడు. నీళ్ళువేడిగానే వున్నాయా. మరీ వేడిగా లేవుకదా! అనడిగాడాకన్నా, ఆ కొడుకు ఆ తల్లిని. ఆ కొడుకు గొంతులో యెంత మార్దవం. ఆ కళ్ళలో యెంత అపురూపమైన భక్తి.

"సరిగానే వున్నాయి నాన్నా" అంది ఆ తల్లి. "పిచ్చినాయన" అంటూ తలమీద చెయ్యివేసి నిమురుతూ.

ఆ 'పిచ్చినాయన' కి యెన్నేళ్ళనుకున్నావు. డెబ్బై దాటాయి. మరి, ఆ తల్లికి శతమానం దాటిందిరా కన్నా. ఆ పిచ్చినాయన ఆ తల్లికి ఏడోసంతూ, అయిదో కొడుకూను.

ఆ తల్లిపేరు తిరిపమ్మరా. త్రిపుర అని తల్లి దండ్రులు పెట్టుకున్న పేరు తిరపమ్మయిందిరా. మూడు లోకాలకి ఆ త్రిపురసుందరి తల్లయితే; ఆ వూరికి, ఆ బంధుజనానికి ఆ తిరపమ్మ కన్నతల్లి యిందిరా కన్నా.

కన్నతల్లి పురిట్లోనే కన్నుమూస్తే; ఆ తల్లికీ, ఆ తల్లిని కన్న తండ్రికీ తల్లీదండ్రీ తానే అయి పెంచు కొచ్చాదురా; ఆ తల్లికి పెద తండ్రీ, ఆ కన్నతల్లి తండ్రికి అన్నగారూను. ఆ తండ్రులిద్దరికీ కన్నతల్లే కంటి దీపంరా కన్నా.

ఆ తల్లి అలా అపురూపంగా పెరుగుతూ వచ్చిం దిరా. అచ్చు అలనాటి పార్వతీదేవిలా వుండేదని అనే వారురా కన్నా చూసినవాళ్ళందరూ.

ఎనిమిదోయేడు రాగానే, పొరుగూర్లో వున్న పురుషోత్తముడ్ని తీసుకొచ్చి, కాళ్ళుకడిగి, ఆ తల్లినీ, ఆ తల్లితోపాటు తమనీ ఆసాంతం అర్పితం చేసుకున్నారా అతగాడికి. ఆ విధంగా ఆ తల్లి ఆ పురుషోత్తముడి యింటి దీపమయిందిరా.

అతగాడిపేరు యేయితేనేం, పురుషోత్తముడురా. దబ్బపండులాంటి రంగుతో, అంతెత్తుమనిషై, చిరు మందహాసమే సిరిసంపదలుకాగా, మంగళకరుడైన ఆ పరమశివుడిలా వుండేవాడురా.

చూసేవాళ్ళ కళ్ళకి ఆహ్లాదకరంగా, మనస్సులకి వుల్లాస భరితంగా వుండేవారురా కన్నా ఆ పుణ్య దంపతులు. ఆ దంపతుల అపురూపానురాగాల ఫలితంలా సప్తమహర్షుల్లా యేడుగురు కొడుకులు, లక్ష్మీసరస్వతుల్లా యిద్దరు కూతుళ్ళు పుట్టుకొచ్చారా. ఆ పార్వతీపరమేశ్వరుల్ని ప్రమథగణాలు సేవించు కున్నట్టుగా సేవించుకున్నారా ఆ తల్లినీ, ఆ తండ్రినీ.

పెద్దకొడుకులో కన్నతండ్రినీ, అయిదో కొడుకులో తెలియని కన్నతల్లినీ, మిగతావారిలో తాను నోచిన నోముల ఫలాన్ని చూసుకుందిరా తల్లి.

ఊరంతా ఆ తల్లిని పిలిచే పిలుపు ఒకటేరా. నాలిక తిప్పగలిగినవాళ్ళు, "అమ్మా త్రిపురా" అంటే; నాలిక తిప్పలేని వాళ్ళు "అమ్మగోరండి తిరపమ్మగోరండి" అనేవారు. చేత్తోటే తప్ప, నోటితో లేదనే అలవాటు, ఆ యిల్లాలికెన్నడూలేదురా. అరదేశి, పరదేశి, ఎవరికైనా సరే ఆ తల్లి యింట్లో పట్టెడుమెతుకులు గ్యారంటీయేరా కన్నా.

ఆ పురుషోత్తముడికి చిరుమందహాసం చెయ్యడం తప్ప, చిరుకోపం ప్రకటించడం తెలియదురా. ఆదరిం చడం తప్ప, అదిలించడం యెరగదురా ఆ తల్లి. అడ్డా లలో బిడ్డలయినా, ఆవుపడ్డయినా; అంతెత్తుమనిషైనా, ఆబోతయినా ఆ తల్లి దగ్గర పసిపిల్లలేరా.

కన్నవారి ఆశీస్సులా యింటినిండా సమృద్ధిగా పాడి, పంట వుండేదిరా. ఆ తల్లిపాలు పిండితే, ఎటువంటి పొగరుమోతుపశువైనా, పొదుగులు పొంగిపొర్లగా

## "అమ్మా..."

పాలిచ్చేదిరా. ఇంటపాడిలేని వారందరూ, ఆ యింటి పెరటి గుమ్మందగ్గరే వుండేవారు. ఆ పెరటి గుమ్మమే సింహద్వారంలా వుండేదిరా. అందరినీ పేరు పేరునా పలకరించి పాలూ, మజ్జిగా పోసేదిరా ఆ తల్లి. ఆ రోజుల్లో వున్నది పంచుకోవడమేకాని, అమ్ముకోవడం తెలియదురా. పాడికానీ, పెరట్లోనూ పొలంగట్ల మీద కాసిన కాయగూరలుకానీ అవసరానికుంచుకుని మిగిలింది అవసరమున్న వాళ్ళకి పంచి యివ్వడమే తెలుసురా కన్నా నాటి జనానికి.

"అమ్మా, నీ చేత్తో నువ్వుచేసిన మజ్జిగ కాస్తపొయ్యి తల్లీ" అనేవారురా చాలామంది. ఇంకెవ్వరు మజ్జిగ పోసినా వాళ్ళకి నచ్చుబాటయ్యేదికాదురా. "నీ చేత్తో మజ్జిగ పోసినట్టుండదమ్మా" అనేవారు. ఎందుకంటే కన్నా, ఆ తల్లిపోసిన గిన్నెడు మజ్జిగ తీసుకుని, యింటి కెళ్ళి మళ్ళీ కవ్వంతో చిలికితే ఆ గిన్నెడు మజ్జిగలోనూ గజనిమ్మపండంత వెన్నపడేదిరా. తన హృదయంలో నవనీతాన్నంతా ఆ మజ్జిగతో పంచేదిరా ఆ తల్లి.

చీకటుండగానే చెరువుకెళ్ళి మడినీళ్ళు తెచ్చు కోవడం తప్ప, గడపదాటి యెరగదురా తల్లి. సొల్లు కబుర్లకీ, యిచ్చకాలకీ యిచ్చగించేదేకాదు. ఏ రుక్మిణీ కళ్యాణమో, సీతా కళ్యాణమో, ఆధ్యాత్మరామాయణ కీర్తనలో పాడుకుంటూ లంకంత యింటినీ, పెరడునీ, పాడి పశువుల్నీ చూసుకోవడంతోనే ఆనందాన్ని పొందేదిరా. ఆ రోజుల్లో లేదన్న బాధకన్నా వుందన్న సంతృప్తినే ఎక్కువగా పొందేవారురా జనం. అందుకనే వాళ్ళు జీవితాన్ని నిండుగా అనుభవించే వారురా కన్నా.

కన్నా, ఆ తల్లి తన బిడ్డలకే కాక వూరంతటికీ మాతృమూర్తి అయిందిరా. ఆ తల్లి కన్న బిడ్డలంటావా, ఆ తల్లిని అంత అపురూపంగానూ చూసుకున్నారురా.

ఒక్కొక్క కొడుకూ ఒక్కొక్క సామ్రాజ్యాన్ని యేలగలిగే సమర్థుడయినా, ఆ తల్లికి అడ్డాలలో బిడ్డలేరా కన్నా. అందరూ ఆ తల్లికి కన్న తండ్రులేరా.

ఆ తల్లి అడక్కుండా, ఆమె అంతరంగాన్ని తెలిసి ఆ బిడ్డలు ప్రవర్తించారురా. బిడ్డలు కష్టపడతారేమోనని, తన మనసులోని చిరుకోర్కెని కూడా తెలియనిచ్చేది కాదురా ఆ తల్లి. ఆవిడ అభీష్టాన్ని నీసమెత్తుకూడా బీరుపోనీయకుండా పూర్తి చేసేవారురా ఆ పిల్లలు.

ఆ తల్లి కన్నబిడ్డలనేకాదురా కన్నా, ఆ బిడ్డల భార్యలు కూడా, ఆవిడలో కన్నతల్లినే చూసారురా. కన్నతల్లిలానే సేవించుకున్నారురా. ఆ తల్లికి వాళ్ళూ కన్నబిడ్డలే అయ్యారురా

ఆ తల్లి వున్నన్నాళ్ళూ, ఆ యింట్లో ప్రతిరోజూ ఒక పర్వదినంలా గడిచిపోయిందిరా కన్నా.

ఆ తల్లికి శతమానందాటినా, పెద్దకొడుక్కి ఎని మిది పదులునిండినా, ప్రతివిషయం ఆ తల్లికి మనవి చేసి, ఆవిడ చేత అలాగే అనిపించుకుని, ఆ పని చెయ్యడం ఆ కొడుకులకానందం. ఆ పూట వంట ఏం చెయ్యాలో ఆ తల్లికి చెప్పి అవుననిపించుకోవడం ఆ కోడళ్ళకి సంతృప్తినూ.

తాము పిల్లలుగా వున్నప్పుడు, ఆ తల్లి అడ్డాల్లో పెరిగారురా. తరువాత ఆ తల్లిని అడ్డాల్లో బిడ్డగా సాకార్రా, ఆ కొడుకులూ, కోడళ్ళూను.

వయసుచేత నడుం ఒంగిపోతే, ఆ కొడుకులే వెన్ను పూసలయ్యారురా. మసకలు కమ్మిన కళ్ళకి వెలుగు రేకలూ వాళ్ళే అయ్యారురా. కోడళ్ళు కర్మేంద్రియా లయితే, కొడుకులు జ్ఞానేంద్రియాలయ్యారురా కన్నా.

చిన్నప్పుడు, ఆ తల్లి, తమనెంత అపురూపంగా పెంచిందో అంతకు దీటైన భక్తి ప్రేమలతో, సంధ్యా రాగాన్ని ఆలాపిస్తున్న ఆ తల్లిని కొలుచుకున్నారా ఆ బిడ్డలు. మనవల్నీ, మనవల మనవల్నీ కనులపండుగ్గా చూసుకుంటూ, నిండు నూరేళ్ళుదాటి పది వసంతాలు ఆ జ్యోతి వెలిగిందిరా కన్నా.

"అంత బతుకూ బతికి ఆ తల్లి ఏం సాధించింది" అంటావా. సంతృప్తిరా కన్నా. నిండు జీవితాన్ని పరి పూర్ణంగా అనుభవించిన తృప్తిరా. అనుభవాన్ని పండించుకుని, ఆనందాన్నే పంచుకొనగలిగిన తృప్తిరా కన్నా. లేనిదాని కోసం అర్రులు చాచకుండా వున్న దానిలోనే స్వర్గధామాన్ని నిర్మించుకోగలిగిన తృప్తిరా అది. అదిలేకే గదా నేడీ అశాంతి. కాదంటావా కన్నా.